# స్వయంవరం



రోహిణీకార్తె! మారాకుచాటు మల్లెమొగ్గలు ఒళ్ళు విరుచుకొంటున్నాయి. నీలాల నింగిలో జరీఅంచుల వెండిమబ్బులు వాహ్యాళికి బయలుదేరుతున్నాయి.

ఉదయం తొమ్మిది గంటలకు పైబడి ఉంటుంది. లేలేత సూర్యకిరణాలు సూదుల్లా గుచ్చుకొంటున్నాయి. నడమంత్రపుసిరి పెగ్గెలాగా వగాతగాలేకుండా ఉన్నట్లుండి పెరిగిన ఊరు. ఆ ఊళ్ళో తలాతోకా లేని రోడ్లు. అప్పటికే ఆ ఊళ్ళో చీకటిని నిగ్గదీసినట్లున్న తారు రోడ్లు కడుపుచేత పట్టుకొన్న జనంతో కిటకిటలాడిపోతున్నాయి.

అంతకంటే కిటకిటలాడిపోతూ ఒక టౌన్‌బస్సు ఒకానొక రోడ్డుమీద రొప్పుతూ రోజుతూ... జనాన్ని చీల్చుకొంటూ...

ఆ బస్సులో కుదురుగా కూర్చొని కొందరు.... నింపాదిగా నిలబడి కొందరు... ఒంటికాలిమీద అపరభగీరథులై కొందరు... గబ్బిలాలు తలకిందులుగా వేలాడితే తలలు పైకెత్తి కమ్మిని పట్టుకొని కొన్ని ఆకారాలు! కిటకిటలాడుతున్న ఆ బస్సులో కటకటలాడిపోతూ అందరూ!

అందరికంటే దైన్యస్థితిలో ముంగాళ్ళమీద అశోక్!

'ప్రజాసేవయే మా కర్తవ్యం' అన్న నినాదాన్ని ఆర్టీసీవాళ్ళు కేవలం నినాదంగానే మిగిల్చితే మన జనం మాత్రం దేన్ని గౌరవించి మరిదేన్ని గౌరవించకపోయినా ఆ బస్సులో 'స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం. వాళ్ళకు కేటాయించిన సీట్లలో వాళ్ళనే కూర్చోనిద్దాం' అన్న ఆర్టీసీ నినాదాన్ని గౌరవించిన కారణంగా స్త్రీలు కాలుమీద కాలు వేసుకుని దర్జాగా కూర్చున్నారు. అలా స్త్రీలకు కేటాయించిన సీట్లలో ముగ్గురు కూర్చోవలసిన ఒకానొక సీట్లో ఇద్దరు అమ్మాయిలు మాత్రమే కూర్చున్నారు. ఆ సీటుపక్కనే మునివేళ్ళమీద అశోక్ కమ్మి ఆధారంగా దాదాపు వేలాడుతున్నాడు.

ఆ ఇద్దరు అమ్మాయిల్లో ఒక అమ్మాయి అతనిని గమనించింది. పడుతున్న అవస్థను చూసి జాలిపడింది. పక్కన అమ్మాయిని కాస్త సర్దుకోమని అభ్యర్థించింది. తాను మరికొంత సర్దుకొనింది. దాంతో దాదాపు సగంసీటు ఖాళీ అయినట్లయింది. అప్పుడు అశోక్‌ను చూపులతోనే పలకరించి కూర్చోమనింది.

అశోక్ తటపటాయించాడు.

"ఫర్వాలేదు కూర్చోండి. కూర్చోండి! మరీ అంత అపర ప్రవరులనిపించుకుంటే స్త్రీ జాతి ఋణపడిపోతుంది." ఎంతో పరిచయం ఉన్న వ్యక్తిలా ఎత్తిపొడుపును ఆత్మీయతలో మేళవించి పలికింది. అశోక్ బుద్ధిగా కూర్చున్నాడు. ఒదిగి ఒదిగి కూర్చున్నాడు. ఆ రద్దీలో మునివేళ్ళమీద నిలబడడమే ఒక యాతనగా మిగిలితే ఆ అమ్మాయి తన చూపుల్లో పడకుండా తప్పించు కొనింది. కూర్చున్న తరువాత ఆ అమ్మాయివైపు చూశాడు.

అతని తల వాలిపోయింది.

"ఏంబాబూ? మెడవాలిపోయిందే! పెద్ద అందగాడినన్న నీ మెడబిర్రు సడలిపోయిందా?" అని ఆమె అందం సవాలు చేస్తున్నట్లుంది. అశోక్ వంచిన తల పైకెత్తలేదు. కనీసం ఓరచూపులు చూడడానికి కూడా సాహసించలేదు.

బస్సు ఆగింది. మళ్ళీ సాగింది.

కొందరు దిగారు. అంతకురెట్టింపు మంది ఎక్కారు. బస్సులో తొక్కులాట... తోసులాట... మరీ ఎక్కువయింది. అంతమందిని మోయలేనన్నట్లుగా ఆ బస్సు ముందుకు కదలడానికి ఆపసోపాలు పడుతూ ఉంది. ఒకేసీట్లో వాళ్ళ శరీరాలు పక్కపక్కన్నే. మనసు మాత్రం ఎక్కడెక్కడో ఊహాలోకాల్లో!

మళ్ళీ బస్సు ఆగింది.

ఆమె ఉలిక్కిపడ్డట్టుగా పైకిలేచింది. అశోక్ కూడా పైకి లేచాడు. ఆమె సందేహంగా అతని వైపు చూస్తూ.

"మీరు కూడా దిగుతారా?"

"లేదు మేడమ్!"

"అయితే ఎందుకు లేచారు?"

"అది కృతజ్ఞతకు చిహ్నం!' అని అతడు చెప్పలేకపోయాడు. కానీ అతని ముఖకవళికలను బట్టి గ్రహించింది.

"మీరు కూర్చోండి"

"థాంక్స్!"

ఆమె చిరునవ్వు నవ్వింది.

ఆమె పెదవులపై పూసిన పూలు అశోక్ కళ్ళల్లో ప్రతిఫలించాయి. ఇద్దరి చూపులు ఒక్కక్షణం కలిశాయి. ఆ క్షణంలో ఆ చూపుల్లో అలలు అలలుగా ఎన్నికలలో...!

ఆ లోపుగానే అక్కడ బస్సెక్కిన ఇద్దరు ఆడవాళ్ళు ఆ ఖాళీస్థలాన్ని భర్తీ చేశారు. ఆమె దిగిపోయింది. అతడు చూస్తూ నిలబడ్డాడు!

బస్సు కదిలింది.

ఆ ఊరి శివార్లలో ఒక పార్క్ తప్పడముక్కుకు ముత్యాల ముక్కుపుడకలా ఆ టౌన్‌కి అందంగా అమరిందా పార్క్. అశోక్ ఆ పార్కు దగ్గర దిగాడు. సరాసరి పార్క్‌లోకి నడిచాడు. ఒక చెట్టు కింద కూర్చున్నాడు. చంకన వేలాడుతున్న సంచిన తీసి పక్కనపెట్టాడు. ఆ సంచిలోనుంచి పుస్తకం తీసుకుని పుటలు విప్పాడు.

పుటలనిండా ఆ పుత్తడిబొమ్మ ప్రతిరూపాలే!

అశోక్‌కి నవ్వు వచ్చింది.

రాదామరి? కాలేజీలో చదువుకొంటున్న రోజుల్లో అందమైన అమ్మాయిలను ఒక ఆటపట్టించిన సోగ్గాడు తాను. చదువులో బంగారు పతకాలను సాధించిన ఘనుడు తాను. అలాంటి తన మనసునే ఆక్రమించిన అందం. అందానికి మించిన సంస్కారం. ఓహ్! అద్భుతం అనుకొన్నాడు. ఆ రూపాన్ని అలానే కనులముందు సాక్షాత్కరింపచేసుకోవడానికి ప్రయత్నిస్తూ విచలిత నేత్రాలతో చెట్టుకు చేరగిలపడ్డాడు.

ఒకనాడు తన వెంటపడిన అమ్మాయిలందరూ ఒకరి తర్వాత ఒకరుగా కనులముందు మెదులుతుంటే ఆ అమ్మాయి వెంటపడిన మనసును స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు.

* * * * *

ఆ అమ్మాయి బస్సు దిగింది.

ఆ ఒక్కరోజే కాదు. ప్రతిరోజు అక్కడే బస్సు దిగుతుంది. ఆ బస్‌స్టాప్‌లో చూపులన్నీ తన వెంట నడుస్తూంటే రాజహంసలా ఆఫీసుకు నడుస్తుంది.

"అందం, అందానికి తగిన చదువు. చదువుకుతగిన ఉద్యోగం! అమ్మాయి అంటే అలా ఉండాలి. బతుకంటే అదీ బతుకు. ఎవడో అదృష్టవంతుడు!" అని ఆలోచించనివాడు రసవిహీనుడు. అలా అనుకుంటున్నారని ఆ అమ్మాయికి కూడా తెలుసు.

తెలుసు కాబట్టే ఆమె వేసే ప్రతి అడుగులో అది వ్యక్తమవుతూ ఉంటుంది.

అది సహజం కూడా!

అయితే ఆరోజు మనసు హాయిగా అనుభూతి పొందినా ఏదో పోగొట్టుకున్నదానిలా బస్సు దిగింది. అడుగులో అడుగ్గా అన్యమనస్కంగా ఆఫీసుకు నడిచింది. కుర్చీలో కూర్చొనింది. ఫైలు తీసి ముందు పెట్టుకొనింది. ఎంత ప్రయత్నించినా మనసు లగ్నం కావడం లేదు. అసలు మనసు అక్కడ ఉంటే గదా లగ్నం కావడానికి?

"ఛీఛీ! ఏమిటి? ఒక్క చూపు చూస్తే చాలు. ఒక్క చిరునవ్వు పెదవులపై పూస్తే చాలు. పెదవివిప్పి ఒక్కమాట మాట్లాడితే చాలు! అని లోకమే తన చుట్టూ తిరుగుతూ ఉంటే తన మనసు అతడెవరో? ఏమో? అతని చుట్టూ తిరుగుతూ ఉందే?" అని చాలాసార్లు మనసును స్వాధీనంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించింది.

ఆమె అలా ప్రయత్నిస్తూనే ఉంది!

మనసు అతని చుట్టూ పరిభ్రమిస్తూనే ఉంది!

చూసింది ఒక్క చూపు. ఆ చూపులు కలిసింది ఒక్క క్షణం. ఆ క్షణంలోనే తన్ను ఆకట్టుకొన్న అందం. అందమంటే మగవాళ్ళు కూడా ఇంత అందంగా ఉంటారా అన్నంత అందం!

అతనికి పెళ్ళి అయిందో? లేదో....? కాకుండా ఉంటే...

ఆమె బుగ్గలు కెంపులు తొడిగాయి.

అసలు అందగాళ్ళకున్న అవలక్షణం అతనికి ఉందేమో...? అందుకే ఆ అతివినయం...!

ఆమె గుండె ఒక్కక్షణం ఆగినంతపని.

ఇంతకూ ఏం చదువుకొన్నాడో? ఏం ఉద్యోగం చేస్తున్నాడో...?

పనిని పక్కనపెట్టి ఆమె పనిగట్టుకొని ఆలోచిస్తూ ఉంది.

* * * * *

అవును. అశోక్ ఏం ఉద్యోగం చేస్తున్నాడు?

"బియ్యేగాదు. దానికి పైన సదువంట. ఎమ్మే అంట్నే. ఆ సదువు కూడా సదివినాడంట. సదివినాడంటే అట్నా ఇట్నా? ఫస్ట్‌కళాసంట. ఎన్నో గోల్డుమెడల్సు గూడా కొట్నాడంట. అటు మంటోడికే ఉద్యోగం రాలేదంటే నమ్మేదెట్టబ్బా? ఈ కాలంలో ఎందుకూ పనికిరానోళ్ళే ఏల్లేలు తీసుకొని ఉద్దోగాల్జేస్తా ఉంటే...? ఎమ్మే సదివినానని సెప్పుకుంటా ఈ పిలగాడిట్టా అడ్డతిరుగుళ్ళు తిరగతా ఉండాడే?"

ఆ పల్లెటూళ్ళో ఎవరినోట్లో విందామన్నా ఇదేమాట.

అశోక్ విన్నాడు. బాధపడ్డాడు. ఆ తర్వాత ఆలోచనలో పడ్డాడు.

"చదువు సంధ్యలులేని అమాయకులు. పాపం వాళ్ళకేం తెలుసు ఉద్యోగాలంటే చెట్టుకు కాసేకాయలు కాదని! తన చదువుకు తగిన ఉద్యోగం. ఆ ఉద్యోగానికి ఖాళీ. ఆ ఖాళీ భర్తీ

చేయడానికి తతంగం. ఆ తతంగం ఒక రాజకీయ రణరంగం. వీళ్ళకేం తెలుసు?" అని సరిపెట్టుకోవడానికి ప్రయత్నించాడు.

కానీ...

ఆఊళ్ళో కాస్త వయసుమళ్ళినవాళ్ళు ఎదుటపడ్తే చాలు. ఎగతాళిచేసినట్లుగానే 'ఏంవిరా అబ్బోదా! నువ్వు నిజంగానే ఎమ్మేదాకా సదివావా? లేకుండా బోతే అ టవున్లో సిల్మాలనీ, షికార్లనీ జల్సాగా తిరగతా ఉంటివా?' అని ఎత్తిపొడిచేసరికి తనకు ఏడుపు వచ్చినంతపని అయింది. తనలోతాను కుమిలిపోయాడు. తన తెలివితేటలతో కష్టపడి సాధించిన చదువు ప్రశ్నార్థకంగా మిగిలి తన్ను ఒక బడుద్ధాయిగా చిత్రించేటప్పటికి తాను ఈ భూమిమీద మిగిలి కూడా ప్రయోజనం లేదనుకొన్నాడు.

"ఈ దేశంలో ప్రజలు మనిషి తెలివితేటలను కొలిచే సాధనం అంటే ఉద్యోగం ఒక్కటే! ఆ ఉద్యోగమే లేకపోతే మనిషి తెలివితేటలు చదివిన చదువులు నిరర్థకం. ఛీఛీ! ఏం మనుషులో? ఏం మనస్తత్వాలో?- అయినా అమాయకులు. వాళ్ళనని ఏం ప్రయోజనం? ఈ దేశవ్యవస్థ ఇలా అఘోరించింది. ఏదిఏమైనాసరే? ఒక మంచి ఉద్యోగం సాధించుకొనేవరకు ఈ ఊళ్ళో అడుగుపెట్టేది లేదు."

ఆలోచించి ఆలోచించి అశోక్ ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఆ నిర్ణయాన్ని తన తల్లితో చెప్పాడు.

ఆమె లబోదిబోమని మొత్తుకొనింది. తల్లికి బిడ్డను దూరం చేయాలని ఊరు తనమీద పగబట్టిందని అపోహపడింది. ఆ బాధతో యుక్తాయుక్తం మరిచిపోయింది. నోటికొచ్చిన మాటల్తో ఊరిమీద విరుచుకపడింది.

ప్రయోజనం?

ఆమె అడిగిన మాటలు గాలికిపోయాయి. కొడుకు కాలికి బలపం కట్టుకొన్నాడు. ఆ తల్లి హృదయం తహతహలాడింది. ఆమె అశోక్ రెండుచేతులు పట్టుకొని "నాయనా! లోకులు కాకులురా. వాళ్ళ కూతల్తో మనకేం పనిరా? వాళ్ళేదో వాగుతున్నారని నాకడుపు కోతకొయ్యకు బిడ్డా! నువ్వు ఉద్యోగాలు చెయ్యాల్సిన పన్లేదు. ఊళ్ళేలాల్సిన పన్లేదు. మా కండ్లముందరుంటే చాలు" అంటూ కంటతడిపెట్టింది.

ఆ కంటతడి అశోక్ గుండెను కరిగించలేకపోయింది.

కన్నపేగు కదా?

కన్నకొడుకు చేతులు విడిచిపెట్టి కట్టుకొన్నభర్త కాళ్ళావేళ్ళా పడింది.

"ఏంవండీ? విన్నారుగదా వాడి మాటలు? వాడిఆలోచన్లు వాడివేగానీ కన్నపేగుబాధ వాడికేం తెలుసు? మీరైనా చెప్పండి. వాడు ఉద్యోగాలు చేసి ఎవరిని ఉద్ధరించాలి? సంపాయించి ఎవుడికి పెట్టాలి? ఒక్కగానొక్కడు. కళ్ళముందరుంటే చాలు. వాడినొదిలిపెట్టి నేనుండలేను" అంటూ బతిమాలింది.

భర్త అంతా విన్నాడు. వేదాంతిలా ఒక నవ్వు నవ్వాడు.

"ఏంవండీ? పిల్లికి చెలగాటంలా ఉందే మీ నవ్వు?"

"పిచ్చిదానా! పిల్లితో చెలగాటం కాదే? ఇది జీవితంతో పోరాటం. పిచ్చిగా ఆలోచించకు. జీవితం అంటే ఒకరికెదురుగా ఒకరు కూర్చోవడం కాదే? వాణ్ణి చదివించింది కూడా అందుకు కాదు. పారాడే చీమను చూసి అయినా నేర్చుకోరాదా? దాని పుట్టలో ఆ పూటకు లేకనా ఆ పాకులాట! అంతే! చీమను ఆదర్శంగా తీసుకొని మనిషి సంపాదించాలి. అవసరమైనప్పుడు ఆ సంపాదన జాతికి సద్వినియోగం కావాలి. అంతేకానీ ఎవరో సంపాదించింది తింటూ కూర్చోవడం బతుగ్గాదే? పోనీ! ఎక్కడికి పోతాడు? జీవితం అంటే ఏంవిటో తెలుసుకొనే దానికేగదా పోతున్నాడు. జీవితం విలువలు తెలిస్తేనే ఆస్తిపాస్తుల విలువలు తెలిసేది."

ఉపదేశ వాక్యాలతో ఉపశమనం కలగలేదు కానీ కడుపు రగిలింది.

అయినా అబలగా ఎదురు మాట్లాడలేక పోయింది.

తల్లి ఆత్మీయత. తండ్రి జీవితాదర్శం.

అశోక్ బుద్ధిజీవుడు.

ఆత్మీయతను ఆదర్శం జయించింది.

పెట్టె సర్దుకోవడానికి అతనికి ఎక్కువ సమయం పట్టలేదు!...

ఆ పట్టణంలో ఒక అందాల భవంతికి దిష్టిచుక్కలా అమరిన అవుట్‌హౌస్ తన కోసరమే ఎదురుచూస్తున్నట్లున్న కారణంగా ఆశ్రయం కోసం అంతగా శ్రమపడవలసిన అవసరం కూడా కలగలేదు.

వాస్తవానికి ఒక కలిగిన ఇంటిపిల్లలకు ట్యూషన్లు చెప్పి ఆ ఇంటి అవుట్‌హౌస్‌లో తలదాచుకోవలసిన అవసరంలేదు_అశోక్‌కి. అవును. ఒక ఆడపిల్ల. ఆ తర్వాత తాను. తన తర్వాత మరొక ఆడపిల్ల. ఆ పరిమిత కుటుంబంలో తాను వంశోద్ధారకుడు. అందగాడు. విద్యాభ్యాసంలోనూ బంగారుపతకాలు సాధించిన ఘనుడు. సంఘ అవిశ్వాసాన్ని చూరగొన్న విద్యాధికుడు. భావిభారత పౌరుడు. తాతముత్తాతల ఆస్తిపాస్తులకు వారసుడు. ఈ కర్మభూమిలో అదృష్టజాతకుడు!

ఆ అదృష్టజాతకుడికి అవుట్ హౌస్‌లో తిప్పలు తప్పలేదు.

కష్టాలను కొనితెచ్చుకోవడానికి ఎవరూ ఇష్టపడరు.

అశోక్‌కి తన కాళ్ళమీద తాను నిలబడాలన్న నిర్ణయం కష్టాలకు కారణమయింది.

తెల్లవారుజామున్నే నిద్రలేవడం... కాలకృత్యాలు తీర్చుకోవడం... ఒకచేత్తో పుస్తకం పట్టుకొని స్టౌముందు కూర్చోవడం... శ్రమపడి ఆ పూటకి మధ్యాహ్నానికి అంత వండుకోవడం. వండుకున్నదాన్ని చిన్న టిఫిన్ బాక్స్‌లో సర్దుకోవడం... తర్వాత స్నానం పానం... ఆ తర్వాత చంకకు సంచీ... ఆ సంచిలో కొన్ని పుస్తకాలు... టిఫిన్ బాక్స్.. అప్పుడు అవుట్ హౌస్‌నుండి బయటపడడం... లైబ్రరీకి నడవడం.. అక్కడ కూర్చొని ఉద్యోగావకాశాలను వేటాడుతూ పత్రికలు తిరగేయడం.. అక్కడ బస్సెక్కడం... పార్కు దగ్గర దిగడం... ఒక చెట్టుకింద తిష్టవేయడం...

మధ్యాహ్నం టిఫిన్ ఖాళీచేయడం... సాయంకాలంవరకు పుస్తకాల్లో తలదూర్చి తలకింత ఎక్కించుకోవడం.. అప్పుడు గూడుచేరడం. ఆ ఇంట్లో పిల్లల్లో పిల్లవాడై వాళ్ళను చదివించడం అశోక్ నిత్యకృత్యం!

అశోక్ ఒక్కరోజు కూడా తప్పకుండా పార్క్‌కు వెళుతుంటాడు.

అమె ప్రతిరోజు ఆఫీసుకు వెళ్ళుతుంటుంది.

ఇద్దరిదీ ఒకే దారి. ఆవేళప్పుడు ఆ దారిలో అదే బస్సు. అ బస్సులో ఆరోజు ఆ ఇద్దరి చూపులు కలిసినవేళ ఒక శుభవేళ. ఆ శుభవేళ ఆ చూపులు మళ్ళీ మళ్ళీ కలుసుకోవడానికి దోహదం చేసింది.

ఆ తర్వాత కూడా ఒకటి రెండుసార్లు అనుకోకుండా అలాగే కలిసి వచ్చిన సందర్భాల్లో ఆమె కూర్చోమని ఆహ్వానించింది. అతడు కూర్చున్నాడు. ఆమె పక్కన అతడు. అతని పక్కన ఆమె. కలిసి ప్రయాణం చేస్తున్నది కొంతదూరమే కావచ్చు. కానీ ఇద్దరి గుండెల నిండా ఎంతో దూరం కలిసి ప్రయాణం చేస్తున్న అనుభూతి. ఆ అనుభూతిలో మనసులు విప్పుకోవాలని మధన. చేతకాని పరిస్థితి. ఆ పరిస్థితిలో చిత్రమైన తపన!

ఎవరి తపనలో వాళ్ళు. ఎవరి తాపత్రయంలో వాళ్ళుంటే పట్టించుకోని బస్సు ఎవరిని ఎక్కడ దింపాలో దింపేసి తన తాపత్రయం తనదిగా కస్సుబుస్సులాడుతూ ముందుకు దూసుకొని పోతుంది.

బస్సుదిగడం బతుకుబాధ్యతలు తలమీదికెక్కడం ఎవరిదారి వాళ్ళదే!

అశోక్ ఆ పార్క్‌లో ఒక చల్లని చెట్టుకింద కూర్చుంటాడు. ఆమె ఆఫీసులో దర్జాగా కుర్చీలో కూర్చుంటుంది. అయినా బస్సులో అనుభూతి నుండి బయటపడడానికి చాలా శ్రమ పడవలసి వస్తుంది. ఆ శ్రమలోకూడా ఒకఆనందం!

కాలం విలువైనదే కాదు.బలమైనది కూడా!

దాని ప్రభావానికి అతీతులు కావడం కష్టం.

ఒకనాడు ఆ బస్సులో వాళ్ళిద్దరు ఒకరి పక్కన ఒకరు కూర్చోవడం అనుకోని సంఘటన. ఇప్పుడు ఆశిస్తూ ఎదురుచూస్తున్న అవకాశం.

అలా ఆశిస్తున్న అవకాశం ఆరోజు అనుకూలించింది. బస్సులో అంత రద్దీ కూడా లేదు. వాళ్ళిద్దరు ఒకరి పక్కన ఒకరు కూర్చొని ఉన్నారు. బస్సు పరుగులమీద ఉంది. అప్పుడు ఆ అమ్మాయే చొరవ తీసుకొనింది.

"మీరేం చేస్తుంటారండీ?" అని అడిగింది.

ఆ మాటతో కూడా అశోక్ అది బస్సు అన్న సంగతి కూడా మరిచి పకపక నవ్వాడు.

ఆమె భృకుటి ముడిపడింది.

అశోక్ గ్రహించాడు.

"క్షమించండి మేడమ్"

"క్షమించాల్సినంత తప్పు మీరేమీ చేయలేదు. ఏం చేస్తుంటారని అడిగితే ఎందుకా నవ్వు?"

"మీరు తెలివైనవాళ్ళు. చాలా సూక్ష్మగ్రాహులుకదా మేడమ్!"

"ఇదేంవిటి మగసంప్రదాయం తారుమారయిందే?"

ఆమాటకు తనవద్ద బదులు లేదన్నట్లుగా అశోక్ తికమకపడుతుంటే ఆమె గ్రహించి ముసి ముసిగా నవ్వుకొంటూ...

"సాధారణంగా అబ్బాయిలు అమ్మాయిల అందంతోనే మొదలుపెడతారు."

"ఓహో అదా? అలాంటి మెప్పులకు అతీతమయింది మీ అందం. అందుకే నేను..."

"మరొకవైపు నుంచి నరుక్కొని వద్దామనుకొన్నారా?"

"కాదు... మీ తెలివితేటల్తో నేనేం చేస్తుంటానో గ్రహిస్తారనుకొన్నాను"

ఈమాటకు తనవద్ద బదులులేనట్లుగా ఆఅమ్మాయి తెల్లబోయి చూస్తుంటే-

"చూడండి మేడమ్! ఖద్దరు గుడ్డలు ధరిస్తే ఇదొక రాజకీయశాల్తీ అనుకుంటామా? అదే ఖాకీ దుస్తులైతే పోలీస్ అంటాం. తెల్లకోటు తొడుక్కుంటే డాక్టర్. అదే నల్లకోటైతే వకీల్. ఈ మాసినగుడ్డలు... పెరిగిన గడ్డం... అరిగిన చెప్పులు... చంకలో సంచీ-ఈ వేషాన్ని చూస్తూనే 'ఇతడు భారతదేశంలో ఒక నిరుద్యోగి' అని ఠకీమని ఎవరైనా చెప్పగలరు. అలాంటప్పుడు మీరు..."

ఆమాటతో ఆమె నవ్వు ఆపుకోలేక పోయింది.

అంతలో బస్సు ఆగింది. ఆమె నవ్వుకొంటూ దిగిపోయింది.

తాను దిగవలసినచోట అశోక్ కూడా బస్సు దిగాడు.

అతడు పార్క్‌లో చెట్టుకింద కూర్చున్నాడు. ఆమె ఆఫీసులో కుర్చీలో కూర్చొనింది. ఇద్దరు గతుక్కుమన్నారు. ఎప్పుడు మారాయో? ఎలా మారాయో? వాళ్ళిద్దరి టిఫిన్ బాక్సులు మారిపోయాయి!

ఆ మధ్యాహ్నం ఆమె పులిహోరతింటూ ఆ వంటకాన్ని మెచ్చుకోకుండా ఉండలేక పోయింది. ఆమె తెచ్చుకొన్న చిత్రాన్నం తినడానికి అశోక్ కొంత ఇబ్బంది పడవలసి వచ్చింది.

"ఈ పొరబాటు ఎలా జరిగిందో? తనకు తెలియకుండా జరిగిందని చెప్తే ఆమె నమ్ముతుందా? ఛ్! ఏమనుకుంటుందో ఏమో? కావాలని చేసిన తుంటరిపనిగా భావించి కోప్పడదుకదా? ఆ కోపంతో దూరమైతే..."

ఆ రాత్రి అశోక్‌కి కంటిమీద రెప్పవాలడం కష్టమయింది.

ఇలాంటి ఆలోచనలతోనే తెల్లారింది.

ఆరోజు గుండెలు చేతపట్టుకొనే బస్సెక్కాడు. మనస్సులో చిన్న సందేహం పరివ్యాప్తం చెంది శరీరాన్నంతా ఆక్రయించింది. చూపులు ఆమె వైపు మళ్ళడమే కష్టమయింది. కానీ ఆమె మాత్రం చిరునవ్వులతో ఆహ్వానిస్తూ ఉంది. అశోక్ గుండెదిటవు పడింది. వెళ్ళి పక్కన కూర్చున్నాడు. అభినందనల పూబంతులు ఆశించని రీతిలో ఆడుకొన్నాయి.

"మీరు చాలా అదృష్టవంతులండీ... మీ శ్రీమతి చేతివంట అద్భుతం!"

"తాను దూరకంతలేదుకానీ మెడకొక డోలా మేడమ్!"

"అయితే మీతల్లిని అభినందించి తీరాలి"

"అయ్యో పాపం పిచ్చితల్లి. ఎక్కడో ఆమడల దూరాన ఒక మారుమూల పల్లెలో తనబిడ్డ ఏంతింటున్నాడో? ఎలాఉంటున్నాడో? అని కంటికి కడివెడుగా ఏడుస్తూ ఉంటుంది"

"అయితే వంట?"

"స్వయంపాకం"

"నిజమా?"

"అబద్ధం చెప్పాల్సిన అవసరం నాకు లేదు"

"అయితే ఆ అదృష్టం ఎవరికుందో కానీ మిమ్మల్ని వరించినావిడ మాత్రం..."

"ఎలాగూ ఉద్యోగంలేదు. ఈ వ్యవస్థలో సాధించుకోగలమన్న నమ్మకమూ లేదు. కనీసం ఆ ఉద్యోగమైనా చేద్దామని"

అంతలో బస్సు ఆగింది.

ఆమె దిగిపోతూ– అరెరె... మరిచిపోయాను. నిన్న మన టిఫిన్‌బాక్స్‌లు మారిపోయాయి కదా? ఇదో మీది మీకు. నాది నాకివ్వండి" అంటూ అతని బాక్స్ అతనికిచ్చి తన బాక్స్ తాను తీసుకొని వెళ్ళిపోయింది.

ఆ మధ్యాహ్నం చిత్రాన్నం తింటూ ఆ వంటకాన్ని ఆమె మెచ్చుకోకుండా ఉండలేక పోయింది. ఆమె తెచ్చుకొన్న పులిహోర తినడానికి అశోక్ నంజవలసి వచ్చింది.

ఆ తర్వాత మంచి మంచిగానే ఆ అమ్మాయి అశోక్‌ని పరీక్షల్లోకి దింపింది.

"ఏంవండీ? మీకు వెజిటబుల్ పలావ్ చేయడానికి వచ్చా?" అని అడిగేది.

అశోక్ అదెంతపని అన్నట్లుగా చూసేవాడు.

"అయితే రేపు..." అంటూ ముసిముసిగా నవ్వేది.

అంతే! ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా? అని ఎదురుచూస్తూ అయిదుగంటలకు ముందే నిద్రలేచి స్టౌముందు కూర్చునేవాడు.

అప్పుడు వద్దనుకొన్నా వంటలో తన తొలిరోజులు గుర్తుకొచ్చేవి.

ఆ మహాపట్టణంలో తలదాచుకోవడానికి తావు సంపాదించుకోవడం అసాధ్యాన్ని సాధ్యం చేసుకోవడమే. అంతవరకు బాగుంది. అయితే కడుపు? వచ్చిన చిక్కంతా దానితోనే కదా?

శరీరంలో ఇన్ని అవయవాలున్నాయి. ఏదీ ఏమీ అడగదే? ఈ కడుపు మాత్రం అడుగుతుంది. పెట్టినా పెట్టినంతవరకే! విశ్వాసంలేని మనిషికి దీనికి తేడా ఏమీలేదు. కడుపు అనబడే ఈ ఒక్క భాగం లేకుంటే ఎంత బాగుండేదో? అని చాలాసార్లు ఆలోచించాడు. 'మళ్ళీ ఈ జానెడు కడుపుకోసరమేకదా ఈ చదువులు.. చట్టుబండలు... ట్యూషన్లు.. ఇంటర్వ్యూలు.. ఉద్యోగాలు వగైరా వగైరా' అని సరిపెట్టుకొన్నాడు.

అందుకే ఒక కిరోసిన్ స్టౌ కొన్నాడు. కొన్ని అల్యూమినియం పాత్రలు కొన్నాడు. ఉప్పు, పప్పు బియ్యం వగైరా సరుకులు కొన్నాడు. వంటలు పిండివంటలు పుస్తకం కొన్నాడు. ఒక కుర్చీ టేబుల్ కొన్నాడు. అప్పుడు చేతి వైపు చూసుకొన్నాడు. ఈ వస్తువులన్నీ కలిసి మాట్లాడుకొని చేతి గడియారాన్ని, ఉంగరాల్ని మింగేసిన సంగతి అప్పుడు తెలిసింది.

బోసిగా మిగిలిన ఎడమచేత్తో బుజ్జి పొట్టను బుజ్జగిస్తూ అశోక్ అలవోకగా నవ్వుకొన్నాడు.

ఆ బుజ్జిపొట్టను తృప్తిపరచడానికి ఎన్నితిప్పలో?

కట్టెల పొయ్యికి ఒక మెట్టుపైన గ్యాస్‌స్టౌకు ఒక మెట్టు కింద కిరోసిన్ స్టౌ స్థానం. అదే మధ్యతరగతి మానవుడి మహాప్రస్థానం! ఆ మహాప్రస్థానంలో ఎన్ని ఆటంకాలో? గంటల తరబడి క్యూలో నిలబడి కిరోసిన్ తెచ్చుకోవడం ఒక యజ్ఞం. ఆ కిరోసిన్ ఒలికిపోకుండా స్టౌలోకి ఒంపడం ఒకకళ. కాలిపోయిన వత్తుల్ని పైకిలాగడం ఒక అనుభవం. కొత్తవత్తుల్ని ఎక్కించడం బ్రహ్మవిద్య. ఎంత జాగ్రత్తపడినా అప్పటికే చేతులు కంపుగొట్టుకొనిపోవడం ఖాయం. ఆ చేతులు కడుక్కోవాలి. ఆ కడిగిన చేతుల్తో బియ్యాన్ని కడగాలి. కడిగిన బియ్యాన్ని ఎసట్లో వేయాలి. చిమిడిపోకుండా ఉడకబెట్టు కోవాలి. ఇంత శ్రమపడినా ఆ మెతుకులు గొంతు దిగమంటే దిగవే? తోడుకావాలంటాయ్. ఏదో కూరానారా చేసుకోవాలంటే వంటలు పిండివంటలు పుస్తకం గైడ్!

కొత్తల్లో వంటమాట తల్చుకుంటే కంపరం పుట్టుకొచ్చేది. 'ఈ పూట పస్తుండిపోతే పోతుంది' అనుకునేవాడు. ఏంచేస్తాడుపాపం? ఎంత జాగ్రత్తపడినా ఎసరు తక్కువో ఎక్కువో కావడం. అన్నం మాడిపోవడమో, చిమిడిపోవడమో జరగడం. ఇక వంటలు పిండివంటలు పుస్తకం ముందుపెట్టుకొని కూర్చుంటే ఏదో సామెతగా అయ్యావారిని చెయ్యబోతే కోతి అయినట్టుగా కూరలు! చేసిన పనినే మళ్ళీ మళ్ళీ చేస్తే వచ్చిన ఫలితమే వస్తుందన్నట్లు వండిన వంట మళ్ళీ వండితే కష్టానికి కష్టం. నష్టానికి నష్టం. కాలానికి కాలం అన్నీ వృధా. అందుకే ఆ పూట అంత పాలు పండుతో సరిపెట్టుకొనేవాడు.

అలా సరిపెట్టుకోవడానికి ఒక్క దినమా? రెండుదినాలా? కాదే? ఆ తర్వాత అయినా వంట తప్పదుకదా? అందుకే అభ్యాసం మీద నమ్మకాన్ని పెంచుకొన్నాడు.

అభ్యాసం కూసువిద్య!

అభ్యాసంతో అనుభవం. అనుభవంతో అశోక్ చేయితిరిగింది. వంటపాకాన పడింది. ఇప్పుడు తాను పాకశాస్త్ర ప్రవీణుడు.

ప్రావీణత సాధారణంగా సత్ఫలితానికి దారి!

అందుకే అది ఒక అందమైన అమ్మాయితో స్నేహానికి దారితీసింది.

"అందం... కొంపలు నిలిపింది అందమే! కూల్చింది అందమే. పడగొట్టిందీ అందమే. అందాల తాజ్‌మహల్ కట్టడానికి దారితీసింది అందమే. అలాంటప్పుడు ఒక అందమైన అమ్మాయికోసం ఈ మాత్రం శ్రమపడలేనా?" ఈ ఆలోచన అశోక్ మనసులో మెదులుతుంది. ఉత్సాహం రెట్టింపు అవుతుంది.

వెజిటబుల్ పలావ్ అద్భుతంగా తయారవుతుంది.

ఆమె పలావ్ రుచిని నలభీమపాకంతో పోలుస్తూ 'అద్భుతం' అని పొగుడుతుంది. 'వెజిటబుల్ పలావ్ అద్భుతం!' అన్నాకదా! మరి– పొంగలి...' అంటూ దీర్ఘం తీస్తుంది. పొంగలి రుచిని కొనియాడుతూ చక్కెరపొంగలి చేయమని పురమాయిస్తుంది. ఇలా వంటలన్నీ అశోక్ చేతులమీదుగా చేయించింది. రుచి చూసింది. 'నలుడు భీముడు ఎలా చేసేవారో ఏమోకానీ అశోక్! వాళ్ళు కూడా నీముందు దిగదుడుపే' అని మెచ్చుకొనింది.

అశోక్ ఒక ఇంటర్వ్యూలో మేధావుల్ని మెప్పించినంత తృప్తిపడ్డాడు. తన జన్మమే సార్థకమైనట్లు సంబరపడి పోయాడు.

ఆరోజు ఆమె బస్సుదిగుతూ–

"మిష్టర్ అశోక్! ఈవేళ మీరు నాతో మాఆఫీస్‌కు వస్తున్నారు" అనింది.

ఆమె ఎక్కడ పనిచేస్తున్నది? ఊరేమి? పేరేమి? అంతవరకు అడగలేదు. అప్పుడు కూడా అశోక్ మారుమాట్లాడ లేదు. ఆమెతోకలిసి బస్సుదిగాడు. ఆమెతో కలిసి నడుస్తున్నాడు.

గుంపులు గుంపులుగా రకరకాల వయస్సుల్లో పిల్లలు...

దారిలో కాలేజీలకు... కాన్వెంట్లకు నడుస్తూ...

"మిష్టర్ అశోక్! ఈ దేశంలో ఇలాంటి పిల్లలు ఎంతోమంది. అందరూ మనలాగే చదువుతారు. డిగ్రీలు సాధిస్తారు. ఉద్యోగాల వేటలో పడతారు. ఎక్కడున్నాయి ఉద్యోగాలు? ఎంతమందికని ఇస్తారు ఉద్యోగాలు...? అందరూ పల్లకి ఎక్కాలని తపించేవాళ్ళే. అయితే మోసేవాళ్ళెవరు...? ఈ దేశభవిష్యత్తు ఏమైపోతుందో ఏమో?"

ఆమెను అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు అశోక్!

అంతలో ఆమె ఆ ఆఫీసులో ప్రవేశించి నేరుగా ఓ గదిలో అడుగుపెట్టింది. ఆమె వెంట అశోక్ కూడా.

'డా॥ సీతాలక్ష్మి, సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటు ఆఫ్ ఇండస్ట్రీస్' అన్న 'నేమ్‌ప్లేట్' కంటపడింది. ఆమె పేరు, చేస్తున్న ఉద్యోగం అప్పుడు తెలిసింది.

ఆమె అందానికి అభిరుచికి అనుగుణంగానే ఆమె ఆఫీసు గది కూడా చాలా అందంగా చూడముచ్చటగా ఉంది. ఆమె తన కుర్చీలో కూర్చుంటూ అశోక్‌ని కూడా కూర్చోమనింది. అశోక్ కూర్చున్నాడు.

"చెప్పండి మిష్టర్ అశోక్...! మీ చదువెలా సాగుతూ ఉంది?"

ఆ మాటతో అశోక్ పకపక నవ్వేశాడు.

"ఎందుకా నవ్వు?"

"అడగాల్సిందొకటైతే అడుగుతున్నది ఇంకొకటిగా ఉంది కాబట్టి!"

"అంటే?"

"అడగాల్సింది చదువెలా సాగుతోందని కాదు మేడమ్...! నిత్యకృత్యం వంట ఎలా సాగుతూ ఉందని?"

ఆమాటతో ఆమె కూడా పకపక నవ్వింది. అంతలోనే గంభీరంగా-

"మిష్టర్ అశోక్! తెల్లవాడు మహాతెలివైన వాడు. మన తెలివితేటల్ని ఈ కుర్చీకి టేబుల్‌కు పరిమితం చేసిపోయాడన్న వాస్తవాన్ని ఎవ్వరూ కాదనలేరు. పరిస్థితి ఇలానే కొనసాగితే ఈ నిరుద్యోగ సమస్యను దేవుడే దిగివచ్చినా తీర్చలేడు. మీవరకే తీసుకోండి. ఈ పోటీపరీక్షలతో పోటీ పడడానికి మీ కాలాన్ని వృథా చేయకుండా పూనుకుంటే మీరొక హోటల్ అద్భుతంగా నిర్వహించగలరు. పదిమందికి జీవనోపాధి కల్పించగలరు"

"నాకా స్టార్ లేదు మేడమ్!"

"మీరు లేదంటే నేను ఉందంటాను"

"నాచేతి వంటరుచి మీకు తెలుసు కానీ..."

"ఆర్థికపరిస్థితి తెలియదంటారు!... తెలిసే మాట్లాడుతున్నాను. ఒక హోటల్ యజమానిగా స్వయం ఉపాధి పథకంతో నేనీ స్వయంవరం చాటిస్తున్నాను. ఆ హోటల్ అతి త్వరలో స్టార్ హోటల్‌గా మీ స్టారే మారుస్తుందని హామీ ఇస్తున్నాను. ఏఁవంటారు?" అంటూ సీతాలక్ష్మి అతడు తెచ్చిన టిఫిన్‌బాక్స్ మూత తీసింది. తనకు ప్రియమైన చక్కెర పొంగలి కమ్మని వాసనలు గదిలో గుబాళిస్తున్నాయి.

అనుకోని మలుపుతో అశోక్ మెలికలు తిరిగిపోతూ, 'అంత డబ్బు!' అంటూ నసిగాడు.

"ఒక్క షరతుకు మీరు అంగీకరిస్తే మిగతా బాధ్యత అంతా నాదే!"

"చెప్పండి"

"హోటల్ యజమానిగా ఆ హోటల్ తిండి నా మొఖాన కొట్టానంటే నేను ఒప్పుకోను. జీవితాంతం మీరే వండిపెట్టాలి"

"అంతకంటే భాగ్యమా?"

"ఏ ఆడదానికైనా అంతకంటే మించిన భాగ్యమా?" అన్న ఆమె మనసులోని భావాన్ని గ్రహించినట్లుగా చక్కని సన్నాని సంగీతం వినిపించింది గోడమీది గడియారం! ●

విపుల
(1, మే 1993)